క్లుప్తంగా

పెద్దమ్మకు పూజలు



పెద్దమ్మకు పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని భానుముక్కల పెద్దమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో దేవర ఉండటంతో భానుముక్కల రైతు సంఘం, ప్రజల ఆధ్వర్యంలో పెద్దమ్మకు ముడుపు క్రతువును పూర్తి చేశారు. దీంతో దేవర ముగిసే వరకు ఎలాంటి శుభకార్యాలు చేయకూడదని, మాంసాహారం తీసుకోకూడదని రైతు సంఘం పెద్దలు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



పూజలందుకున్న శివ పార్వతులు

డోన్: స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో వందలాది మంది శివస్వాములు శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ వివాహ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. అనంతరం సతీసమేతుడైన స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కార్యకర్తల గైర్హాజర్‌పై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ సుబ్బరాజు తనిఖీ చేశారు. ఇద్దరు కార్యకర్తలు గైర్హాజరు కావడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణితో ఫోన్‌లో మాట్లాడారు. అనుమతి తీసుకొని కనకాద్రిపల్లెకు వెళ్లారని ఆమె చెప్పారు. అనంతరం పిల్లలకు అందించే మెనూ గురించి ఆయాల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పిల్లలకు నాణ్యతతోపాటు పరిశుభ్రంగా ఉండేలా చూసుకొని మెనూ అమలు చేయాలని కోరారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులతో పాటు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు.

రేపటి నుంచి టెక్కెస్వామి ఉరుసు

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామ పొలిమేర కొండల్లో వెలసిన హజరత్ అపాం షావలి బాబా టెక్కెస్వామి ఉరుసు మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉరుసు మహోత్సవాలకు గ్రామ పెద్దలు గూడాల శివరామిరెడ్డి, మురళీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 9న గంధోత్సవం, 10న ఉరుసు ఉంటుందని, ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడికి వచ్చిన భక్తాదులకు కునుకుంట్ల గ్రామపెద్దలు, భక్తులచే అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి

ప్యాపిలి: గర్భిణులకు ప్రతిరోజూ తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకునేలా ఆశాలు కృషి చేయాలన్నారు. రక్తహీనతతో బాధ పడుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి రక్తంఎక్కించాలన్నారు. ప్రసవానికి వారం రోజుల ముందే గుర్తించి వారు పీహెచ్‌సీలో ప్రసవం కోసం అడ్మిట్ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఆరోగ్య విద్యాబోధకుడు రాఘవేంద్రగౌడ్, మనోహర్ రెడ్డి, యశోద తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత



విరాళాన్ని అందిస్తున్న దాతలు

డోన్ టౌన్: స్థానిక వైఎస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమానికి తారకరామనగర్‌కు చెందిన కోయిలకొండ బోయ పాల రాజు మంచం, పరుపు విరాళంగా అందజేశారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం రాజు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

విజయ రథ సారథులు మీరే

- ప్రతి ఇంటికి వెళ్లి చేసిన మేలును వివరించండి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయపథాన నడిపించే రథ సారథులు గృహసారథులేనని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా కొలిమిగుండ్లలోని షిర్డీ సాయి ఫంక్షన్ హాల్‌లో 16 గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు 95 శాతం అమలు చేసిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమ ఫలాలు పేదల ముంగిటకే చేరుతున్న విధానాన్ని వివరించాలన్నారు. అవినీతికి తావు లేకుండా, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రతిఒక్కరికి వివరించాలన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, హనుమంతుగుండం సొసైటీ అధ్యక్షుడు మూల ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు క్రిష్టారెడ్డి, దస్తగిరి, నాయకులు పులి ప్రకాష్‌రెడ్డి, ఇటిక్యాల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం జరగరాదు



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అర్హులకు అన్యాయం జరగరాదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులతో అన్నారు. మంగళవారం కనకాద్రిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ఇప్పటి వరకు జరిగిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. చేకూరిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌లను అందజేశారు. తమకు చేదోడు పథకం అందలేని కొందరు రజకులు, మిరప పంట నష్టం వాటిల్లినా నష్టపరిహారం రాలేదని రైతు బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. దివ్యాంగుడు నాగన్న మూడు చక్రాల సైకిల్ మంజూరు చేయించాలని వేడుకున్నాడు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్ను కోసం డబ్బు డిమాండ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకొని ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు సూరపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టీసీ వెంకట్రాముడు, డాక్టర్ దస్తగిరి, ప్రభావతి, సులోచన, సుబ్బమ్మ, పేరం సత్యనారాయణరెడ్డి, యర్రగుడి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డి గెలుపు కోసం ప్రచారం

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు కోసం మంగళవారం కొలిమిగుండ్లలో బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్సీ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మోడల్ స్కూల్, పలు పాఠశాలలు, హాస్పటళ్లకు చేరుకొని మొదటి ప్రాధాన్యత ఓటు రవీంద్రారెడ్డికి వేసి అత్యధిక మెజార్టీ ఇచ్చి శాసన మండలికి పంపాలని అభ్యర్థించారు.

9న చనుగొండ్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

అవుకు: మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఈనెల 9న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామంలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకోనున్నారన్నారు.

రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు గ్రామంలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఏఈ రమణ తెలిపారు.

యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మద్దయ్య యాదవ్

బనగానపల్లె రూరల్: యాదవులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని రామతీర్థం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు యాదవులకు విద్య, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమ హక్కులు సాధించుకునేందుకు గ్రామ స్థాయి నుంచి యాదవులు సంఘాలుగా ఏర్పాడి ఉద్యమానికి సిద్ధంకావాలన్నారు. అనంతరం యాదవ మహాసభ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గురుమోహన్, ఉపాధ్యక్షులు ప్రతాప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులు తుపాకుల ప్రసాద్, దస్తగిరి బాబు, కార్యదర్శిగా తుపాకుల గోపాల్‌యాదవ్, ట్రెజరర్ పెండేకంటి గోవిందరాజులుతోపాటు మరి కొందరిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ మహాసభ మండల అధ్యక్షులు గణమద్దిలేటియాదవ్, ఉపాధ్యక్షులు బాలవెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



జాకీర్‌హుసేన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త జాకీర్‌హుసేన్‌ను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. గత నెల 14న జాకీర్‌హుసేన్‌ను కైప సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడికి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బా ధితుడి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఎవరెస్టుబాబు, డ్రైవర్‌బాబు, హాజీహుస్సేన్, పెద్దహాజీహుస్సేన్, ముర్తుజా, లియాఖత్, హుసేన్‌సాబ్, అల్లిఅబ్బాస్ ఉన్నారు.

పచ్చ జొన్న దిగుబడులకు డిమాండ్



విక్రయానికి సిద్ధంగా ఉన్న పచ్చ జొన్న దిగుబడులు

బనగానపల్లె: ఈ ఏడాది పచ్చజొన్న పంటకు డిమాండ్ ఉంది. గతంలో క్వింటం రూ.4,200లకు మించకపోగా ఈ ఏడాది కల్లాల వద్దనే రూ.5,400లకు నగదుతో కొనుగోలు చేస్తున్నారు. ఈ పంటకు ఎగుమతి ఉన్నందుననే గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 11 వేల హెక్టార్లలో పచ్చ జొన్న పంటను రైతులు సాగు చేశారు. ఎకరాకు 10 క్వింటాళ్ల తగ్గకుండా పంట దిగుబడి లభిస్తుండగా పెట్టుబడిపోనూ ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు మిగులుతుందని రైతులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని దొరపల్లె బ్రిడ్జి, కంబాలపాడు సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మారం రంగనాయకులు కోరారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం సీఐ శేషయ్యను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. మల్లెంపల్లె గ్రామ దేవతల దేవర సందర్భంగా భక్తులు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తారన్నారు. దొరపల్లె బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిని దాటే సమయంలో అక్కడ మలుపు లేని కారణంగా ప్రమాదాలు జరిగి అవకాశం ఉందన్నారు. పోలీసు బందో బస్తును ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నియంత్రించాలని కోరారు.

పంటల నమోదు తప్పనిసరి



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు,కైప గ్రా మాల్లో రబీ పంటల నమోదును ఏఓ సుబ్బారెడ్డి మంగళవారం పరిశీలించారు. రైతులకు అవసర మైన సలహాలు, సూచనలు ఇచ్చారు.పంటల నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

బేతంచెర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబుల్ రెడ్డితో కలిసి వారు 2, 5 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలుంటే తమకు చెప్పాలని కోరారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, షేక్ ముబీనా, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

బేతంచెర్ల: ఓ మహిళ వ్యవసాయ పనులకు వెళ్లి ట్రాక్టర్‌పై నుంచి కింద పడి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించింది. ఏఎస్‌ఐ లింగమయ్య వివరాలు.. కోటపేట కాలనీకి చెందిన కమ్మరి మల్లికార్జున భార్య భ్రమరాంబ(35) పొలం పనులకు సోమవారం ఉదయం వెళ్లింది. ఇంటికి వచ్చే క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చొంది. మార్గమధ్యలో ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపటంతో భ్రమరాంబ ఎగిరి కిందపడి తీవ్రగాయాలపాలైంది. బాధితురాలిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. మృతురాలి భర్త మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య మంగళవారం తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కోన మురళీధర్ రెడ్డి

ప్యాపిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన గృహసారథులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్ రెడ్డి, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం గృహసారథులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి గృహసారథులు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. ఇంటి యజమాని అనుమతి తీసుకుని ఇళ్లకు స్టిక్కర్‌లు అతికించాలన్నారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు వర్తించని వారి వివరాలు సేకరించి అందుకు కారణాలు తెలుసుకోవాలన్నారు. సదరు సమస్య వలంటీర్ దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేలా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, జంగం చంద్రశేఖర్, పర్వతం శ్రీను, జయరామయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న గృహసారథులతో ఎమ్మెల్యే సమావేశం

బనగానపల్లె: ఈ నెల 11న స్థానిక ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల గృహసారథు ల సమావేశం ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిశీలకులు మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు అఫ్జల్‌ఖాన్ హాజరవుతారన్నారు.

వ్యక్తికి గాయాలు



గాయపడిన రమేష్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంజామల మండలం పేరుసోములకు చెందిన రమేష్ గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పేరుసోముల నుంచి పని నిమిత్తం బైక్‌లో కొలిమిగుండ్లకు బయలు దేరాడు. మార్గమధ్యలో కల్వటాల వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్: స్థానిక కొండపేట గుత్తి రోడ్డు ఫ్లైఓవర్ కింద క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతిచెందిన అనాథ, యాచకుడు నాగోషుడు అంత్యక్రియలను ద్రోణాచలం సేవాసమితికి చెందిన ఆత్మబంధువు సేవాసమితి సభ్యులు మంగళవారం నిర్వహించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నాగోషుడు మృతదేహానికి పోలీసులు పంచనామా అనంతరం అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆత్మబంధువు సేవాసమితి సభ్యులు గురుస్వామి, పానిపూరి మురళి, ఆటో సుధాకర్, నగేష్‌లు తెలిపారు. అంత్యక్రియల్లో హెడ్‌కానిస్టేబుళ్లు వెంకట్రామిరెడ్డి, కానిస్టేబుల్ మునిస్వామి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

డోన్ టౌన్: ఆలయ ట్రస్టు బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించడం అభినందించ దగ్గ విషయమని నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం డోన్ అధ్యక్షుడు కలచట్ల చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 610 ఆలయ ట్రస్టు బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. నాయీ బ్రాహ్మణుల గుండెల్లో ఆయన చిర స్థాయిగా ఉంటారన్నారు.

10న సర్వసభ్య సమావేశం

డోన్ రూరల్: ఈ నెల10న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి హాజరు కాబోతున్నారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

యాగంటి క్షేత్రంలో ప్రముఖ గాయకుడు



యాగంటి సన్నిధిలో గాయకుడు కరిముల్లా టీం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రాన్ని ప్రముఖ పాటల రచయిత, గాయకుడు కరిముల్లా టీం సభ్యులు మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ తాను వీరనరసింహారెడ్డి చిత్రంలో జై బాలయ్య అనే పాట రచించి, పాడడం జరిగిందన్నారు. ఈ పాటను యాగంటి క్షేత్రంలో చిత్రీకరించినట్లు చెప్పారు. యాగంటి క్షేత్రం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని, రాబోయే కాలంలో యాగంటి క్షేత్రం సినిమా షూటింగ్‌లకు నిలయంగా మారుతుందని కరిముల్లా అన్నారు. అంతకుముందు ఉమామహేశ్వరస్వామని దర్శించుకుని పూజలు చేశారు.

వీడియో గేమ్‌లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నాగవేణి

కొలిమిగుండ్ల: విద్యార్థులు వీడియో గేమ్‌లకు దూరంగా ఉండాలని ఎంపీపీ కారపాకుల నాగవేణి, ఎంఈఓ జిలానీ బాషా సూచించారు. మంగళవారం చింతలాయిపల్లె ఉన్నత పాఠశాలలో సమత సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాల సంరక్షిత సద్వినియోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, యువతతో పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాలం కత్తి లాంటిదని, దాన్ని విద్యార్థులు తెలివిగా వాడుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లతో పాటు పాఠ్యాంశాలను సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనాలు ఉంటాయన్నారు. పిల్లలు వాట్సాప్‌లో వచ్చే వివిధ రకాల లింక్‌లు వాడరాదని వాటివల్ల దుష్పరిణామాలు ఎక్కువన్నారు. కార్యక్రమంలో సమత సొసైటీ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, హెచ్ఎం బాలరాజు, సీఎస్ఆర్ మేనేజర్ భాస్కర్, రైడ్ ఎన్జీఓ ఈశ్వరయ్య, చైల్డ్ సైకాలజీ డైట్ లెక్చరర్ లక్ష్మీనారాయణ, పంచాయితీ కార్యదర్శి భార్గవి పాల్గొన్నారు.

బాబోయ్.. కొండముచ్చు


- ప్రభుత్వ కార్యాలయాల్లోకి వచ్చి విధులకు ఆటంకం



కోర్టు ఆవరణలో ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్న కొండముచ్చు

డోన్: కొండ ముచ్చు ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లోకి ప్రవేశించి ఉద్యోగుల విధి నిర్వహణకు అంతరాయం కలిగిస్తోంది. స్థానిక ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్‌కుమార్ పలుమార్లు సిబ్బంది సాయంతో కొండముచ్చును పట్టుకునేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో జిల్లా అటవీశాఖ అధికారులు శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు నుంచి డాక్టర్ జుబేర్, డాక్టర్ వెస్లీల ఆధ్వర్యంలో కొండముచ్చును పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. రెవెన్యూ కార్యాలయంతో పాటు న్యాయస్థానంలో కూడా కొండముచ్చు ప్రవేశించి విధులకు ఆటంకం కలిగిస్తుండటంతో అటవీశాఖ ప్రత్యేక బృందం మంగళవారం డోన్‌లో మకాం వేసి కొండముచ్చు కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. సజీవంగా కొండముచ్చును బంధించి అటవీ ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నిస్తామని స్థానిక అటవీ రేంజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా పోలీసుస్టేషన్ ఎదురుగా కొండముచ్చు, తన పిల్లతో విద్యుత్ స్తంభం తీగలపై వెళ్తుండగా అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురయ్యాయి. పిల్ల మృతిచెందగా తల్లి స్వల్ప గాయాలతో బయటపడింది. శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు ప్రత్యేక బృందం కొండముచ్చు కళ్లుగప్పి పిల్ల మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో పోస్టుమార్టం కోసం తరలించారు.

గ్రామ దేవతలకు పూజలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల:మండల పరిధిలోనిగోరుమానుకొండ తండాలో సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మలకు మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. దేవర సందర్భంగా బంధువులు తరలిరావడంతో తండాలో సందడి నెలకొంది.

పోస్టర్ల విడుదల



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

డోన్‌టౌన్: యువత మేలుకో–వేగం తగ్గించుకో నినాదాలతో తయారు చేసిన వాల్ పోస్టర్లను డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు హబీబ్‌బాషా, నక్కి హరి, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, తెలుగు విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వాహనాలను నిదానంగా నడపాలన్నారు. మద్యం తాగి, అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.